# చిత్తే జల్లు

—శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి

ధర్మారావుగారికి అద్వైతం గారికి మాటా మాట వచ్చినట్లు నాకు చాలా రోజులదాకా తెలియదు. ఎప్పుడైన మాట వరసకు యీ మధ్య **అద్వైతం** గారు మీ యింటికి వస్తున్నట్లు **కనిపించటం** లేదే అంటే, రాకేం వస్తూనేవున్నాడు **తన** పనున్నప్పుడు. అది సరేగాని, అంటూ ధర్మా**రావు** యింకో మాటలో దిగేవాడు. ధర్మారావుగారు **కనిపించి** చాలా రోజులయినట్లుందే అని ఆయనతో **అంటే**, నాలుగు వ్యాపకాలు గల మనిషి చీటికి **మాటికి** కనిపించాలంటే యెట్లా వీలుపడుతుంది. అది సరేగాని అంటూ యింకో మాటలోకి దించేవాడు అద్వైతం. వీళ్లిద్దరి మాటల ధోరణి **చూస్తుంటే** నాకు ఏమిటోగా అనిపించేది. అయినా నిక్కచ్చిగా నిలవదేసి, మీ యిద్దరూ యేమన్నా పోట్లాడుకున్నారా అని యేమని అడగను కనక! **ఆసలు** నాకు ధర్మారావుతో అంత పరిచయమూ **లేదు** నిజానికి. ఈ వూరొచ్చిన కొత్తలో, చెక్కు **మార్చుకోవటానికి** బ్యాంకుకు వెళ్లితే, నా పేరు **చూసి**, నన్ను పిలవనంపాడు లోపలికి అద్వైతం. నన్ను గురించి ఆప్యాయంగా మాట్లాడాడు. అడిగాడు. నా పేరు ఆయన చాలా రోజుల పట్టి చూస్తున్నాడట. నన్ను స్వయంగా కలుసుకోవాలని యిటీవలనుంచి అనుకుంటున్నాడట కూడా. ఈ సమయంలో నేను నా అంతట ఆయన దగ్గరకు వెళ్లటం దైవ ఘటన అన్నాడు. ఆయనతో మాట్లాడిన కాసేపు ఆత్మీయుడు మాట్లాడినట్లుగానే నాకు అనిపించింది. సెలవు తీసుకుని వెళ్ళబోతుంటే, నా చిరునామా అడిగి, ఆయన చిరునామా నాకు యిచ్చి మా యింటికి తప్పక రావాలని మొహమాట పెట్టాడు కూడాను. ఆయన వాక్కులో ఒక ఆకర్షణ వుంది. క్రమ క్రమంగా ఆ ఆకర్షణ నన్ను, ఆయనకు అతి సన్నిహితుణ్ణిగా చేసింది. రోజు విడిచి రోజైనా మేం ఇద్దరం కలుస్తూ వుండేవాళ్ళం. కొన్నాళ్ళ వరకు నన్ను పొగుడుతూ వుండేవాడు. తర్వాత ఆయన గొప్పలు చెప్పుకుంటూ పోతూ వుండేవాడు. రెంటికి నవ్వుకుంటూ వుండేవాళ్ళం. నేను ఆయన యింటికి యెప్పుడు వెళ్లినా ఒక వ్యక్తి కనిపిస్తూ వుండేవాడు. మధ్య వయస్సులో వున్నాడు. ఎంతో చనువుగా ఏకవచన ప్రయోగంతో అద్వైతంతో మాట్లాడుతూ వుంటాడు. కుటుంబ వ్యవహారాలు కూడా అన్నీ తెలిసినట్లే యిద్దరూ మాట్లాడుతూ వుండేవారు. ఒకటి రెండుసార్లు ఆయనను చూసి పస్తాయించి వూరుకున్నాను అద్వైతం పరిచయం చేస్తాడేమోనని. కాని ఆయనకు **ఆ** దృష్టి పోలేదు. నేనే ఒకనాడు, మీ యింటికి వస్తూ వున్న మనిషెవరు, నాకు ఒక్కనాడు చెప్పారు కాదు అన్నాను నవ్వుతూ. అన్నట్టు మరిచేపోయానండీ మీకు పరిచయం చెయ్యటం. ఆయన నా ప్రాణ స్నేహితుడు. ఈ వూరు నేను మొదట వచ్చినప్పుడు ఆయన యింట్లోనే దిగాను, చాలా పెద్ద మనిషి ఉపకారి. ఎవరొచ్చి ఏదిఅడిగినా, వీలైనంతలో లేదనడు. నిండు మనిషి. పైకి కనిపించడు కాని, చలా పండితుడు. ఇక్కడ హైస్కూలులో మాస్టరు ఆయన. పేరు ధర్మారావు. సాధారణంగా నలుగురితో చనువు చేసుకొని మాట్లాడడు. అదో రకం మనిషి. ఆయనే అంటూ వుంటాడు. అద్వైతంగారూ, మీకూ నాకు కుదిరింది కాని, యీ వూరొచ్చి యిన్నేళ్ళయింది. యెవరితోను యింత సన్నిహితంగా వుండలేదండి అంటూ, అని అద్వైతం ధర్మారావును గురించి టూకీగా చెప్పాడు, ఆయనను, నాతో పరిచయం చెయ్యక పోవటానికి కారణం యేమిటో చెప్పాననుకొని అద్వైతం సంతృప్తిపడకుండా, నేను ఒక ప్రశ్న వేశాను, మీరు యిన్ని చెప్పారు కాని, నాతో యెందుకు పరిచయం చెయ్యరో చెప్పారు కాదని.

అద్వైతం పకపక నవ్వి యీ సారి వచ్చినప్పుడు పరిచయం చేస్తానులెండి. అయినా, మీ గురించి ఆయన నన్ను అడిగాడు, మా స్నేహితుడు అని చెప్పి వూరుకున్నాను అన్నాడు అద్వైతం.

ధర్మారావు రానే వచ్చాడు. అద్వైతం పరిచయం చేశాడు. ఓహో మీరా! అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించి నన్ను కలుసుకున్నందుకు సంతోషం వ్యక్తపరిచాడు. మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకూ సంతోషంగానే వుందన్నాను. ఏ ముహూర్తం యెలాంటిదో యెవరూ చెప్పలేరన్నట్టు, ఆ క్షణంనుంచి ధర్మారావు నాకు ముఖ్యమైన స్నేహితుడుగా మారిపోయాడు. ఆయన గొప్పతనాన్ని హర్షించే సహనం నాలో వుంది. నన్ను ఆప్యాయంగా పిలువగల నైపుణ్యం ఆయనలోనూ వుంది. ఒకనాడు, నేనూ ధర్మారావు గంటల తరబడి మాట్లాడుతూ వుండటం చూసి అద్వైతమే ఆశ్చర్య పోయాడు. ఈయన ఇంకోళ్లింటికి వెళ్లడు. ఇంకోళ్లతో మాట్లాడడు, వీళ్లిద్దరికీ యెట్లాకుదిరిందా అని. ధారాళంగా, నేను అద్వైతం యింటికి చీటికి మాటికి వెళ్ళ



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ భీమసేన సచార్ నెల్లూరులో బాల వర్తకి చి॥ పద్మప్రియను అభినందించినప్పటి ఫోటో



కేసరి స్కూల్ "ఫౌండర్సు డే" ఉత్సవంలో మద్రాసు గవర్నరు దంపతులు —ఫోటో: శ్రీ సోమయాజులు

తున్నట్టే, ధర్మారావు యింటికి వెళ్లడం మొదలు పెట్టాను. వెళ్లినప్పుడల్లా, గంటల తరబడి కూర్చోవటం, మాట్లాడు కోవటం, మళ్లీ వెళ్లి పోవటం, ధర్మారావు, అద్వైతం, మధ్యలో నేను వచ్చి, వాళ్లిద్దరి సన్నిహితత్వానికి యేదైనా భంగం, కలిగించానా అని ఆలోచించేటంతవరకు పోయింది నా పరిచయం. ఆంతరంగిక విషయాలు అనేకం ముగ్గురం కూర్చుని మాట్లాడుకునే వాళ్లం. ఒకరి భావాలు ఒకరికి నచ్చుతాయని ముగ్గురం సంతోషించేవాళ్లం. అద్వైతం మా యింటికి వచ్చి, నా మాట అడుగుతే ధర్మారావు గారింటికి వెళ్లారని సమాధానం వచ్చేది. అద్వైతానికి ఆశ్చర్యం వేసేది. ఎప్పుడూ వాళ్లింటికి వెళ్లి కూర్చుంటాడు యెందుకూ అని అప్పట్లోనే ఆయన మనస్సులో అనుకున్నట్టు తర్వాత నాకు తెలిసింది. ఒక విధమైన అసంతృప్తి ఆయనలో బయలుదేరినట్టు కూడా మొదట్లో నాకు తెలియదు. నేను పరిచయం చేసిన వ్యక్తితో అంత సన్నిహితం మేమిటి!నా యింటికి కూడా అదివరకు మాదిరిగా రావటం మానేశాడు. వాళ్లిద్దరికి నాకు చెప్పకూడని రహస్యాలు యేమున్నాయి. నన్ను అంత చులకనగా చూస్తాడా ! ఎంత సేపటికి ధర్మారావు ఆయనను పొగడటం, ఆయన ధర్మారావును పొగడటం ! ఆ మాత్రం స్తోత్ర పాఠాలకు నేను తగనా ! నా ముందు వీళ్లెంత ! ఏదో స్నేహితంకోసం నేను చూశాను కాని కాకపోతే యీ ధర్మారావులు, యీయనగార్లు బోటివాళ్లను నా అనుభవంలో యెంతమందిని చూశాను ! ఈ విధంగా అద్వైతం ఆలోచించటం మొదలు పెట్టాడు. కాని, నేను తరచుగా ఆయనింటికి వెళ్లుతూ, తనింటికి రావటం లేదనే గుర్రు తప్ప యింకోటేమీలేదు. తర్వాత నేను యెప్పుడు వాళ్లింటికి వెళ్లినా, ఆ మాటల్లోనూ, ఆ స్వీకారంలోను యే మార్పూ లేదు. అయితే ధర్మారావు మాట వచ్చినప్పుడు నిర్లక్ష్యంగా వో మాట అనేసి యింకో విషయంలోకి దూకేవాడు. ధర్మారావు వాళ్లింటికి వెళ్లినప్పుడు కూడా, నా మాట వచ్చినప్పుడు, అది వినిపించుకోకుండా యింకో ప్రస్తావన తెచ్చేవాడట. ఏమంటే ధర్మారావుగారు, మీ మాట యెత్తుతే, అద్వైతం గారు అదోలాగా మాట్లాడుతున్నారు ఎందుకనీ, అని నేనేమని అడుగను అనుకుంటూ [illegible]కుండా వూరుకున్నాను. కాని ధర్మారావు నన్ను అడగనే అడిగేశాడు ఏమిటి అద్వైతం మీ యింటికి వస్తున్నాడా ! ఎప్పటిలాగానే వుంటున్నాడా అని. ఏం మీరు అట్లా అడిగారు. మేము అదివరకు మాదిరిగానే వుంటున్నాం అని చప్పున అనగానే ధర్మారావు ఆ విషయాన్ని విస్తరించి మాట్లాడకుండా వుండేవాడు. ఎవరి మనస్సుల్లో వాళ్లకు భేదాభిప్రాయాలు మొలకలెత్తటం ప్రారంభించినాయి నాకు తెలియకుండానే.నేను గడపలో అడుగు పెట్టంగానే, ధర్మారావు యింటి దగ్గరనుంచా అని ఓనాడు అద్వైతం అడిగేటప్పటికి, నా ప్రాణం చివుక్కుమంది. ఓ చిరునవ్వునవ్వి, మొన్న నేను ధర్మారావు గారి యింటికి వెళ్లినప్పుడూ, అద్వైతం యింటి దగ్గర్నుంచా అని ఆయనా ప్రశ్నించాడు. నాకేమీ అర్థం కావటంలేదు. అసలు విషయము యేమిటండీ అని అడిగాను. ఆయన యెందుకు అట్లా అడిగాడో నాకు తెలియదుగాని,తరచు మీరు వాళ్లింటికి వెళ్లుతూ వుంటారు కదా అని అడిగాను. అంతే గాని, మీరు అది తప్పు పట్టేస్తారంటే మాత్రం అట్లా అడిగేవాణ్నికాదు అంటూ అద్వైతం, నా భుజం మీద చెయ్యేసి లోపలికి తీసుకువెళ్లాడు. ఆ మాటలు యీ మాటలు మాట్లాడిన తర్వాత, డబ్బు ప్రధానం కాదండీ, మాటా మంచీ ప్రధానం. మనిద్దరం, యింతకాలంనుంచి యింత సన్నిహితంగా వుంటున్నామంటే, మీరు నన్ను పెట్టి పోషిస్తున్నారా! నేను మీకు పెట్టి పోషిస్తున్నానా ! రెండూ లేవు. ఏదో ఒకరి కష్ట సుఖాలు ఒకళ్లతో చెప్పుకుంటున్నాం. మనోవ్యధ తీర్చుకుంటున్నాం అంతేనా ! అన్నాడు అద్వైతం.

మీరు నేను ఏమిటి, లోకంలో అందరూ చేసే పనే యిది. యెవరి బాధ్యతలు వాళ్లవి, యెవరి కష్ట సుఖాలు వాళ్లవి. అయినా యీ ప్రస్తావన యిప్పుడు ఎందుకువచ్చిందంట అని నేను రెండు మూడు సార్లు అడిగినా, అద్వైతం, లోకం తీరు చెప్పానుగాని అంతకంటె యే ముంది అని వూరుకున్నాడు. నేనూ ఆలోచించుకుంటూ యింటికి వెళ్లుతూ, దార్లోనే కదా ధర్మారావుగారి యిల్లు ఓ సారి తొంగి చూసి పోదామని వెళ్లాను.ధర్మారావు సోఫాలో దర్జాగా కూర్చుని, పేపరు చదువుకుంటున్నాడు. నన్ను చూడంగానే చప్పునలేచాడు రండి రండంటూ. ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకున్నాం. అహా! నాకు తెలీక అంటున్నాను. అంత క్రోధం యెందుకంట! మేమేం చేశామని వాళ్లకు. ఉపకారం చెయ్యక పోవచ్చు, అపకారం ఏమీ చెయ్యలేదు గదా! మేమంటేనే, మండి పడిపోతాడు. ఎందుకో అర్థం కావటం లేదు. నేనూ గమనిస్తూనేవున్నా. మీరు మా యింటికి రావటం మొదలు పెట్టారు అప్పటి నుంచి అద్వైతం మారిపోయాడు అన్నాడు ధర్మారావు. పాపం, వాళ్లిద్దరూ ఎడమొహం

పెద మొహం అవటానికి నేనే కారణం అని చెప్పటం ధర్మారావు వుద్దేశం కాదు. కాని ఆయన మాటలో యీ అర్థం స్ఫురిస్తుందే అని గట్టిగా అనుకున్నాను.

అట్లాగా యీ విషయం నాకు తెలీదే అని ఆశ్చర్యాన్ని ప్రకటించాను. ఉభయులకు తెలిసిన వారు కాబట్టి, యేదో మాటల సందర్భంలో చెప్పాను గాని, యిదొక విషయంగా మీరు మన స్సులో పెట్టుకోవద్దని ధర్మారావు అన్నాడుకూడా. అంతే లెండని వచ్చేశాను. మర్నాడు అద్వైతం కలిసినప్పుడు, ధర్మారావుపూర్తిగా మారిపోయాడు. అదివరకు మనిషి కానేకాడు నేను బ్యాంకులో నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నానని యీర్ష్యా, తనకు పదిరూపాయలు రావటం లేదని అసంతృప్తి యేమీ అర్థంకాకుండావుంది.మమ్మల్ని చూస్తేనే గిట్టకుండావుంది. మొన్న మా సరస్వతి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు గులాబి పువ్వు కోసిందని దాన్ని నానా మాటలు అని, చిన్న పుచ్చుకునేటట్టు చేశారట. అది యింత మొహం చేసుకుని యింటికి వచ్చేటప్పటికి నాకు యెంతో బాధ కల్గింది. మొక్కే గులాబి పువ్వులు మేము కొనుక్కోలేక పోతామా యేమిటి! చనువుగా వెళ్ళుతూ వస్తున్నారు కాబట్టి, చిన్నపిల్ల కాబట్టి, ఆ పువ్వు కోసింది. ఈ మాత్రానికి చిన్న పిల్లనే యిందన్నా లేకుండా అట్లా నోటికి వచ్చినట్టు అనేయటమే! వాళ్ళ మోచేతి గంజి తాగుతున్నామా మేము! అహ! చెప్పండి మీరు—అంటూ అద్వైతం నా మొహంలోకి చూశాడు. మౌనం అర్ధాంగీ కారం అవుతుందేమో అని యేదో సమయోచితంగా అన్నాను.

తీరా ధర్మారావుగా రింటికి వెళ్ళితే, ఆయన చిరు బుస్సు లాడుతున్నాడు. నన్ను చూడంగానే లిప్‌స్టిక్ మాదిరిగా చిరునవ్వు పెదిమలమీద అతికించుకుని రండి కూర్చోండి అన్నాడు. వెంటనే చివాలునలేచి, చూశారా! మా అమ్మాయి ప్రాణంతో సమానంగా ఆ గులాబి అంటును చూసుకుంటూ వస్తోంది. ఇన్నాళ్ళకు ఓ మొగ్గ తొడిగింది. దాని సంతోషానికి అంతులేదు. పువ్వు రేపటికి బాగా విచ్చుతుంది అని రెపరెపలాడుతుంటే, ఆ అద్వైతం కూతురొచ్చి, చిటుక్కున ఆ మొగ్గ కాస్తా తుంపేసింది. వాళరకు నేను బాధపడ్డాను. అయినా చిన్న పిల్ల దానికేం తెలుస్తుందిలే అని వూరుకున్నా. మా అమ్మాయి వుక్రోషం పట్టలేక యేమన్నదో యేమో, దానికి పెద్దరాద్ధాంతం చేస్తూ పోట్లాడటానికి వచ్చారు వాళ్ళు. పిల్లలు పిల్లలు మాటా మాటా అనుకుంటారు. దానికి పెద్దవాళ్ళు వస్తారుటండీ. అయినా మా అమ్మాయి యేమన్నది కనక! వాళ్ళ పరిస్థితి ఆ మొగ్గను తుంచెయ్యటం బాగానే వుంది! ఛీ! . . .ఇంత రభస అవుతుందనుకోలా! ధర్మారావు తీవ్రంగానే అనేశాడు. వాతావరణం శాంతించిన తర్వాత ప్రశాంతంగా నాలుగు మాటలు మాట్లాడి యింటికి వచ్చేశాను.

రోజు రోజుకు అద్వైతం, ధర్మారావుగారి మధ్య భేదాభిప్రాయాలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. ఒక మాటకు, ఒక పనికి విపరీత అర్థాలు యిద్దరికే స్ఫురిస్తున్నాయి. ఎవరి భావంలో వాళ్ళు తిష్ట వేసుకుని వుండిపోయారు. ఇద్దరూ కూడా తమ తమ దృక్పథాల్నీ నాకు పూర్తిగా వెల్లడి చేశారు. ఇద్దరి దృక్పథాల్ని నేను విన్న తర్వాత వీళ్ళిద్దరిలో యెవరిది తప్పో అని నిర్ణయించటం నా పనికాదు. వీళ్ళిద్దరూ నేను రానప్పుడు యెంత స్నేహితంగా వుండేవాళ్ళో, ఆ స్థితికి తీసుకు రావటం యెట్లాగా అని ఆలోచించటం మొదలు పెట్టాను.

ధర్మారావుగా రింటికి వెళ్ళినప్పుడు, యీ చిన్న చిన్న విషయాలు మనస్సులో పెట్టుకుని అద్వైతంగారు అట్లా వుండటం యెందుకు చెప్పండి. అయినా మనం విశాల హృదయాన్ని ప్రదర్శించి మనంతట మనమే చనువు తీసుకుని యీ భేదాన్ని సమసి పోయేటట్టు చేస్తే బాగుంటుందేమో అన్నాను. ఎంతసేపటికీ నేను పస్తాయించి ముందడుగు వేద్దామన్నా అద్వైతం అన్నింటికీ అడ్డం పడుతుంటే యేం చెయ్యమంటారు. వాళ్ళ పిల్లకు ఇంగ్లీషు పుస్తకం కావాలంటే సెకెండుహాండు పుస్తకం మా పిల్ల చదివేసింది యిచ్చాను. మేము అడగనూ లేదు పెట్టనూ లేదు ఓ సాయంత్రం కొత్త పుస్తకం కొని తన పిల్ల పేరు వ్రాసి మాకు పంపించాడండీ? ఆ పాత పుస్తకాన్ని యెవరు అడిగారు? పోనీ తనకు, మా పుస్తకం వుంచుకోవటం యిష్టం లేకపోతే మాది మాకు పారేస్తే సరిపోదు. మేము కాదన్నామా? పోనీ కొత్తది కొని యిచ్చాడు అనుకుందాం. దాని మీద పేరెందుకు? ఏమిటి యీ పనులు చెప్పండి అన్నాడు ధర్మారావు.

ఆ సాయంత్రం అద్వైతంతో మాట్లాడుతున్నప్పుడు, పట్టుదలొస్తే పట్టుదలే. ఎప్పుడో వాళ్ళ పిల్ల దగ్గర పాత పుస్తకం తీసుకున్నాం. వెంటనే మార్కెట్టుకు వెళ్ళి కొత్త పుస్తకం కొని ఇచ్చేశాను. వాళ్ళ పుస్తకం వాళ్ళకు ముట్టింది. మా పిల్ల పుస్తకం అట్ట చించేసింది. ఇన్నాళ్ళు వాడుకొని చిరిగిపోయిన పుస్తకం వాళ్ళ కిస్తే ఏమైనా అనుకుంటా రేమో అని కొత్తది ఇచ్చేశాను. అయితే, ఆ కొత్తదానిమీద మా పిల్ల పేరు రాసింది, మనం కొన్నట్టు తెలియడానికి అన్నాడు అద్వైతం.

నేను ఇంటికి వచ్చి తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టాను. వీళ్ళిద్దరు ఏవిధంగా స్నేహితులు అవుతారా అని. అప్పటికే వాళ్ళిద్దరు ఒకరి మొహం ఒకరు చూసి నెలలు దాటింది. రోజూ ఒకర్ని చూడక, ఒకరు వుండలేని వాళ్ళు, నెల లయినా, తట్టుకోగల మనస్తత్వాన్ని అలవరుచుకున్నారు.

అద్వైతంతో మాట్లాడుతున్నప్పుడు మొన్ని మధ్య ధర్మారావుగారు రిక్షాలోంచి పడ్డారుట. బాగా దెబ్బలు తగిలినాయట అని అసంపూర్తిగా అని వూరుకున్నాను. నేనూ మొన్న వంటింట్లో కాలు జారి పడ్డాను. కాలు బెణికింది. నాలుగు రోజులు బాధపడ్డాను అన్నాడు అద్వైతం వెంటనే.

ధర్మారావుగారి దగ్గరకు వెళ్ళి అద్వైతం గారి కాలు బెణికిందట. చాలా బాధపడుతున్నాడు పాపం! అన్నాను.

అట్లాగా. నేను రిక్షాలో నుంచి పడ్డప్పటి నుంచి నా వంట్లో సరిగా వుండటం లేదు. ఎటూ పోవటం లేదు అన్నాడు ధర్మారావు.

ధర్మారావుగారికి జబ్బుగా వుందని అద్వైతంతో చెప్పాను. అవును కాలం మార్పు. మా అమ్మాయి నాలుగు లంఖణాలు చేసింది అన్నాడు అద్వైతం.

అద్వైతం గారి పని అధ్వాన్నంగా వుందని ప్రతి రోజు ఇంజక్షన్లు తీసుకోవటం ఆరోగ్యం పూర్తిగా చెడిపోయిందని ధర్మారావుగారితో చెప్పాను. ధర్మారావుగారు ఆలోచించటం మొదలుపెట్టారు.

ధర్మారావుగారు మంచంలోంచి లేవటం లేదు. ఆయనపని చాలా నీరసంగా వుందని అద్వైతంతో చెప్పాను. అద్వైతం గారు ఆలోచించటం మొదలు పెట్టారు.

ఒకనాడు ఏమనుకున్నాడో ఏమో అద్వైతం రిక్షాలో ధర్మారావుగారి ఇంటికి వచ్చాడు. బిక్కు బిక్కు మంటున్నాడు. ఆ గడప తొక్కి రెండు నెలల పైన అయింది. లోపలికి వెళ్ళి ఏమి మాట్లాడాలి, ఎట్లా మాట్లాడాలి?అని ఆలోచించుకుంటూ వెళ్లాడుట. నిజంగానే ధర్మారావుగారు మంచంలో మూలుగుతున్నాడు. అప్పుడే డాక్టరు తిరిగి వెళ్ళి పోతున్నాడు. మంచంలో అతి నీరసంగా వున్న ధర్మారావును చూసి అద్వైతం కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినాయి. ఇంత జబ్బుగా వుందని, అనుకోలేదని అనుకున్నాడు. ధర్మారావు ఎంతో నీరసంమీద అద్వైతం అన్నాడు. నేనే వచ్చాను ధర్మారావు. చాలా నీరసపడిపోయినావు అన్నాడు అద్వైతం.

ధర్మారావు సుస్తీ వివరాలు ఇంట్లోవాళ్ళు అందుకుని చెప్పేశారు పూర్తిగా. నాకు జబ్బుగా వుందని చూడటానికి వచ్చాడు పాపం అనుకున్నాడు ధర్మారావు.

క్రమ క్రమంగా కష్టాల్లో ఒకరి కొకరు బాగా సన్నిహితు లయిపోయారు. మళ్ళీ ఇద్దరు జంట కవుల్లాగా తిరగటం మొదలుపెట్టారు. ఈ సమయం కనిపెట్టి, నేను వాళ్ళతో ఎక్కువ సన్నిహితంగా వుండకూడ దనుకున్నాను.

ఒకనాడు మాత్రం ధర్మారావు, అద్వైతం కలిసి వెళుతుంటే, నేను తారసిల్లాను. చప్పున నేను తప్పించుకు పోదామనే ప్రయత్నంలో సందు మలుపు తిరిగాను. నన్ను పిలిచినట్టు అనిపించింది. మమ్మల్ని చూసి కూడా పలకరించకుండా యెందుకు అట్లా వెళ్ళిపోయాడా అని వాళ్ళు అనుకున్నారో ఏమో!